ప్రజాశక్తి
ఆదివారం 22 జనవరి 2023

తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని తడిగిరి పంచాయతీ ముల్లుమెట్టలోలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా తాగునీటి పథకంను సర్పంచ్, ఉప సర్పంచ్ పెనుమాల రంజిత్ కుమార్, కిల్లో రామరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో తాగునీటి సౌకర్యాలు లేక కలుషిత నీరు తాగేవారమన్నారు. ముల్లు మెట్ట గ్రామంలో 250 మంది జనాభా ఉండగా తాగునీటి సమస్య అధికంగా ఉండేదన్నారు. గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశామన్నారు.ఈ కార్యక్రమంలో కిల్లో నాగేశ్వరరావు, కిల్లో బుజ్జిబాబు, సీదరి రాజారావు, కిల్లో సుందర్ రావు, మల్లేశ్వరరావు, కృష్ణవేణి, బుజ్జి, వాలంటీర్ మర్రి కమల, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

శిశు మరణాలను నియంత్రించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా - పలు గ్రామాల్లో పర్యటన

ప్రజాశక్తి-హుకుంపేట:శిశుమరణాలను నియంత్రిం చాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా సూచించారు. హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గూడ గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపును ఆయన శనివారం పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరంలో నిర్వహిస్తున్న ఇసిజి, రక్తపోటు, హిమోగ్లోబిన్ శాత నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ శిభిరాలను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. అనంతరం గొచ్చరి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. సకాలంలో గర్భిణులను గుర్తించి నమోదు చేసి, ఐఎఫ్ఏ మాత్రలు ఇవ్వాలన్నారు. పిహెచ్‌సిని సందర్శించి గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. గర్భిణుల సమస్యలను అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. గడుగుపల్లి గ్రామంలో శిశు మరణానికి గల కారణాలను తల్లి, ం కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే తల్లిదండ్రులు గుర్తించి సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తక్షణమే తరలించి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. శిశు మరణాలకు గల కారణాలపై తక్షణమే సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడేరు వైద్యాధికారి నీరజ, జిల్లా టి.బి పర్యవేక్షకులు వి.కిరణ్, పిహెచ్‌సి హుకుంపేట వైద్యాధికారి మెహర్ సుమన, ఆరోగ్య విస్తరణ అధికారి బి.లక్ష్మణ్, అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో మందులు పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కలెక్టర్‌కు గిరిజన సంఘం వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అప్పలనర్స, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన ప్రాంతంలో కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన సంఘం ప్రతినిధి బృందం శనివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు.గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అలప్పులనర్స, జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా త్రినాథ్, గిరిజన సంఘం పాడేరు మండల నాయకుడు భాస్కరరావుతో కూడిన ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్ కుమార్ ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అలప్పులనర్స మాట్లాడుతూ, పాడేరు ఏజెన్సీలో సుమారు 2లక్షల ఎకరాల్లో గిరిజన రైతులు కాఫీ సాగుచేస్తున్నారని,. సుమారు 50వేల మెట్రిక్ టన్నుల కాఫీ ఉత్పత్తి కావడానికి అవకాశం ఉందన్నారు. దళారులు గిరిజన ప్రాంతాల్లో తక్కువ ధరకే కాఫీ కొనుగోలు చేస్తున్నారని, మాక్స్ సొసైటీ కిలో కాఫీ పండు రూ.36, జిసిసి, మాతోట, నాంది పౌండేషన్ రూ.50లకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో అల్లూరి ఏజెన్సీ ఆర్గానిక్ కాఫీకి మంచి డిమాండ్ ఉన్నా అందుకు అనుగుణంగా కాఫీ రైతులకు న్యాయం జరగ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జి.మాడుగుల మండలం గడుతూరు పంచాయతీ నేరేడుబందలో పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.గడుతూరు పంచాయతీ బొడ్డుమామిడి గ్రామంలో సుమారు 175 మంది కొండదొర గిరిజన తెగలు జీవిస్తున్నారని, వారిలో 60 మంది పెద్దలకు, 53 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు లేక పోవడంతో పాఠశాలలో అడ్మిషన్లకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బొడ్డుమామిడి గ్రామంలో అన్ని రకాల ఇంటర్నెట్ నెట్వర్క్ పని చేస్తున్నందున ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన 120 మందికి ఓటు హక్కు కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని, కాఫీకి ధరపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారన్నారు. కాఫీ, మిరియాలు, పసుపు పంటలకు గిట్టుబాటు ధర కోసం ట్రేడర్స్‌తో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారన్నారు.ఆధార్ కార్డు, ఓటు హక్కు ప్రతి ఒక్కరికి కల్పిస్తామని పేర్కొన్నారని తెలిపారు. నేరేడుబందలో విద్యా బోధనకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారని అప్పలనర్స తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం

★ ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న మోడీ సర్కారు
★ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

మాట్లాడుతున్న మంతెన సీతారాం, చిత్రంలో సిపిఎం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు

ప్రజాశక్తి-విఆర్.పురం

గోదావరి వరద ముంపునకు గురైన బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. ముంపు మండలాల్లోని వరద బాధితులను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ రంపచోడవరం జిల్లా కమిటీ సమావేశంలో సీతారాం, మరో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ భయానక గోదావరికి వరద వచ్చి ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడితే ఎవరికీ సరైన సహాయం చేయకపోగా, ఇచ్చిన హామీలను సైతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గాలికి వదిలేశారని విమర్శించారు. వరద బాధితులకు రూ.10వేలు చొప్పున ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి ఆరు నెలలు గడిచినా నేటికీ అందివ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ కాలంలో వ్యవసాయ కార్మికులు, రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీపై స్పష్టత లేదని, గిరిజనులకు ఇచ్చే భూమికి భూమి ఎక్కడా చూపలేదని తెలిపారు. ఇంకా వరదలు కాలం నాలుగు నెలలే ఉండగా, ఇప్పటి వరకు పునరావాసం కల్పించలేదని, ఇళ్లు పూర్తి కాలేదని పేర్కొన్నారు. మళ్లీ వరదలు వస్తే ఇక్కడి ప్రజలకు మరో సారి ఇబ్బందులు తప్పవన్నారు. ప్రభుత్వం వెంటనే ఉన్న ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మరో వైపు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆదివాసీలను తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను సవరిస్తూ కార్పొరేట్లకు అడవులను ధారాదత్తం చేసే కుట్ర చేస్తుందని తెలిపారు. జిఒ నెంబర్ 3ను సుప్రీం కోర్టు రద్దు చేసి రెండున్నరేళ్లు అయినా నేటికీ దాని పునరుద్ధరణకు, దానికి చట్టబద్దత కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కేంద్రం బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రంప చోడవరం జిల్లా కార్యదర్శి బొప్పిన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుంజ సీతారామయ్య, లోత రామారావు, వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ముళ్లపాటి నాగేశ్వరరావు, నక్కల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, కూనవరం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎటపాక మండల కార్యదర్శి ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎఒబిలో మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో ఓ మహిళ శనివారం తెల్లవారుజామున హత్యకు గురైంది. ఈ సంఘటన ఎఒబిలో తీవ్ర కలకలం రేపింది. ఒడిశా పోలీసుల కథనం ప్రకారం.... ఆంధ్ర ఒడిశా సరిహద్దు మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి గుంటవాడ పంచాయతీ, కాకరపాడు గ్రామ సమీపంలో మహిళ హత్యకు గురైన రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గిరిజనులు శనివారం ఉదయం చూశారు. వెంటనే ఆంధ్ర ఒడిశా పోలీసులకు గిరిజనులు సమాచారం అందించారు. దీంతో ఒడిశా చిత్రకొండ సీఐ ముకుంద మిల్కా ఆదేశాల మేరకు పోలీసులు హుటా హుటీన సంఘటన ప్రదేశానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. గుర్తు తెలియని దుండగలచే హత్యకు గురైన మహిళ ఒడిశా, ఆంధ్ర, తెలంగాణ ఏ రాష్ట్రానికి చెందిన మహిళ అని ఆరా తీశారు. అనంతరం సైంటిఫిక్ టీము, డాగ్ స్క్వాడ్ బృందాలను రంగంలో దింపి మహిళ హత్యకు గురైన ప్రదేశంలో ఆనవాళ్లను సేకరించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య మిస్టరీని చేధించడానికి స్థానిక ఎస్ఐ రామకృష్ణ సహాయాన్ని ఒడిశా పోలీసులు కోరారు. దీంతో ఎస్ఐ రామకృష్ణ సీలేరు మెయిన్ డ్యామ్ నుంచి ఏయే వాహనాలు ఒడిశా వెళ్లాయో ఏపీ జెన్కో హోంగార్డులను అడిగి ఆరా తీశారు. అనంతరం సిసి పుటేజ్‌ను పరిశీలించారు. మహిళ మృతదేహాన్ని ఒడిశా మల్కన్‌గిరి ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం ఒడిశా పోలీసులు తరలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ నిబంధన ప్రకారం 72 గంటలు భద్రపరిచి అనంతరం మృతురాలు వివరాలు నిర్ధారణ కాకపోతే పంచినామా చేసి పోస్టుమార్టం నిర్వహించి దహన సంస్కారాలు చేస్తామని ఒడిశా పోలీసులు తెలిపారు.

సంఘటనా స్థలంలో మహిళ మృతదేహం

రోడ్డు సౌకర్యం లేక.. కొండ మార్గం మధ్యలో బియ్యం పంపిణీ

అవస్థలు పడ్డ గిరిజనులు

ప్రజాశక్తి:అరకులోయ రూరల్:మండలంలోని మాదల పంచాయతీ మారుమూల గ్రామాలైన దాబుగుడ, దోమలజోరు, రక్తకండి గ్రామాలకు పూర్తి స్థాయిలో రోడ్డు సదుపాయం లేక పోవడంతో పది కిలో మీటర్లు దూరంలో ఓ కొండ పైన మధ్య మార్గంలో బియ్యం పంపిణి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గిరిజనులు స్వంత పనులు వదిలేసి అష్ట కష్టాలు పడి కొండకు నడుచుకొని వచ్చి ఎండలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు సదుపాయం కల్పించకుండా మారుమూల పంచాయతీ గ్రామాలకు ఇంటింటికి డోర్ డెలివరీ బియ్యం పంపిణి ఎలా సాధ్యం అవుతుందని గిరిజనులు మండిపడుతున్నారు. గిరిజన గ్రామ్లాలో ఎక్కడ కూడా డోర్ డెలివరీ జరగ లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా దాబుగుడ, దోమలజోరు, రక్తకండి గ్రామాలకు 2014లో రోడ్డు మంజూరు మంజూరు అయ్యింది. నేటికీ పూర్తి కాలేదు. గిరిజనులు ఎవరికైనా ఆరోగ్యం బాగోలేనప్పుడు డోలీ మోత తప్ప మరో మార్గం లేదు. గిరిజనులపై చిత్తశుద్ధి ఉంటే ముందు రోడ్డు మార్గం పూర్తి చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ ఇటీవల కాలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా రోడ్డు మార్గం పూర్తి చేసి ఇంటింటికి బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కొండపై రేషన్ తీసుకుంటున్న గిరిజనులు

నినాదాలు చేస్తున్న 108 ఉద్యోగులు

108 ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యలను పరిష్కరించాలని 108 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పాడేరు జిల్లా కేంద్రంలో ఐటిడిఏ వద్ద అల్లూరి జిల్లా 108 ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ రిలే దీక్షలను ఉద్దేశించి అల్లూరి జిల్లా 108 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎన్ త్రినాధరావు, డి.ప్రసాద్, టి.శ్రీదేవి మాట్లాడుతూ,108 అంబులెన్స్‌లో సేవలు అందిస్తున్న ఈఎంటి, పైలట్లకు ప్రతి నెలా జీతాలు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. సంస్థ అధికారుల వేదింపుల కారణంగా ఉద్యోగం ఎప్పుడు తొలగిస్తారో తెలియని పరిస్థితుల్లో అనేక మంది విధులు నిర్వహిస్తున్నామని వాపోయారు. చిన్న చిన్న కారణాలకు కూడా డివిజన్ ట్రాన్స్‌ఫర్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌ఫర్, సస్పెన్షన్, టెర్మినేషన్ వంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జీతం పెంచారని సంతోషం తప్ప భయంతోనే ఉద్యోగం చేయవలసిన పరిస్థితిని ఉద్యోగులకు యాజమాన్యం కల్పించిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ గతంలో 108 ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగిగా గుర్తించి ఉద్యోగ భద్రతను, ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని కోరారు. సమస్యలను ఈనెలాఖరు లోపు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు డివిజన్ అన్ని మండలాల 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖైనీ, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ఖైని, గుట్కాలు విక్రయిస్తున్నారని గిరిజనుల ఫిర్యాదుల మేరకు స్థానిక పంచాయతీ కార్యదర్శి గోపి, వీఆర్వో చెండా రమేష్, గిరిజన సంఘం నాయకులు, మండల వినియోగదారుల సేవా సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. విక్రయిస్తున్న పలువురు వ్యాపారస్తుల వద్ద నుండి ఖైనీలు, గుట్కాలు, ప్లాస్టిక్ కవర్లు స్వాధీన పరచుకుని మండల తహసిల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గోపి మాట్లాడుతూ, అధిక సంఖ్యలో ఖైనిలు, గుట్కాలు, ప్లాస్టిక్ కవర్లు స్వాధీన పరుచుకున్నామని, వీటి విలువ సుమారుగా రూ.45 వేలు వరకు ఉంటుందన్నారు.వారపు సంతలో ఇకపై నుండి దాడులు ముమ్మరంగా చేస్తామని, విక్రయిస్తే సహించేది లేదన్నారు. భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎంఎం శ్రీను, భీమరాజు, నారాయణ, గాసిరం దొర, మండల వినియోగదారుల సేవా సంఘం ప్రతినిధులు ఎస్.ప్రసన్నకుమార్, ఆర్.భూషణ్, కె.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు చేపడుతున్న నాయకులు, కార్యదర్శి

మాట్లాడుతున్న పెంటయ్య, పాల్గొన్న మిడ్డేమీల్, అంగన్వాడీ కార్యకర్తలు

మిడ్డేమీల్స్, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేయాలి

- సిఐటియు మండల కార్యదర్శి పెంటయ్య

ప్రజాశక్తి- కూనవరం

అంగన్‌వాడీ కేంద్రాలకు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పాఠశాలలకు బియ్యం సరఫరా చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకు బియ్యాన్ని వాహనాల ద్వారా సచివాలయాల తరుపున అందిస్తామని గొప్పగా ప్రకటించిన ప్రభుత్వం, ఒక నెల మాత్రమే అందించి చేతులెత్తేసిందని విమర్శించారు. ఇప్పుడు అంగన్వాడీ టీచర్లు, మిడ్డేమీల్స్ వర్కర్లను చౌక దుకాణాల నుండి బియ్యం తీసుకెళ్లాలని చెప్పటం భావ్యం కాదన్నారు. డ్రైవర్లకు మూడు నెలలుగా జీతాలు రాని కారణంగా ఈ రెండు రంగాలకు బియ్యం పంపిణీ చేయలేమని వారు చెప్పినట్లు డీలర్ తెలిపారన్నారు. ఇప్పుడు మేము బియ్యం తరలించుకోవటానికి అయ్యే ఖర్చు ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. మిడ్డేమీల్స్, అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు, నాయకులు కొండ ఈశ్వర్లు, పసుపులేటి ఏడుకొండలు, మిడ్డేమీల్స్ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టబద్ధతను పొడిగించాలి

ప్రజాశక్తి -సీలేరు

ఎస్‌టి, ఎస్‌సి సబ్ ప్లాన్ చట్టబద్ధతను మరో 10 సంవత్సరాలు పొడిగించే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత ఆదివాసీల సమైక్య ఎపి రాష్ట్ర అధ్యక్షులు గడుతూరు రాంగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 2013లో అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టి ఎస్టి ఎస్సి సబ్ ప్లాన్‌కు రాజముద్ర వేసిందని తెలిపారు. దీని గడువు ఈనెల 23తో ముగిస్తుందన్నారు. రాష్ట్ర విభజన తరువాత ప్రభుత్వాల ప్రాధాన్యతలో వచ్చిన మార్పుల వలన ఎస్టీ ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్టి, ఎస్సీ సబ్ ప్లాన్ కాల పరిమితిని మరో పది సంవత్సరాలు కొనసాగేలా ఆర్డినెన్స్ తీసుకొచ్చి చట్ట సవరణ చేయాలని కోరారు.

రైతులు, నిర్వాసితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్

నష్ట తీవ్రతపై సబ్ కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-కొయ్యూరు

రాజమండ్రి నుండి రాజవొమ్మంగి, కొయ్యూరు, పాడేరు మీదుగా విజయనగరం వెళ్లే జాతీయ రహదారి పనులలో భాగంగా మండలంలోని ఇళ్లు, పొలాలకు ఎంత నష్టం జరుగుతుందో పరిశీలించడానికి పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ శనివారం పర్యటించారు. మండలంలోని పెదమాకవరం, నడిం పాలెం గ్రామాలలోని రైతులు, నిర్వాసితులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులు కంగారు పడాల్సిన పనిలేదని, ఆర్థిక సాయం కచ్చితంగా అందుతుందని హామీ ఇచ్చారు. ఈ రహదారిలో నష్టపోయిన రైతులు అందరూ విధిగా వివరాలు తాసిల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆయన వెంట కొయ్యూరు తాసిల్దార్ తిరుమలరావు, సిబ్బంది ఉన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

- 11 మంది అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని అంతాడ, కొత్తపల్లి గ్రామం సమీపంలో కోడిపందాలు శిబిరంపై కొయ్యూరు, మంప పోలీసులు శనివారం దాడి చేసి 11 మందిని అరెస్టు చేసి, ఐదు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు కొయ్యూరు సిఐ స్వామి నాయుడు తెలిపారు. కొయ్యూరు ఎస్సై రాజారావు, మంప ఎస్సై లోకేష్ కుమార్, పోలీస్ సిబ్బంది కిషోర్ ,రాము, నరసింహము, ఏపీఎస్పీ సిబ్బంది సహాయంతో కోడిపందాలు ఆడుతున్న ప్రాంతానికి వెళ్లి దాడి చేశారు. నిందితులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ స్వామి నాయుడు తెలిపారు.

అరెస్టయిన జూదరులతో పోలీసులు


పాత పాడేరులో ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపును పరిశీలిస్తున్న ఎడిఎంహెచ్ఒ

ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్ లను సద్వినియోగం చేసుకోవాలని ఎడిఎంహెచ్ఒ లీలా ప్రసాద్ సూచించారు. పాడేరు మండలం మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాత పాడేరు గ్రామంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపును పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్ వైద్య శిబిరంలో గర్భిణీలకు, ఇతర రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందులను పరిశీలించారు. అనంతరం పి.గొందూరు కాలనీ అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సకాలంలో గర్భిణులను గుర్తించి నమోదు చేయడంతోపాటు ఐఎఫ్ఎ మాత్రలు అందించాలని, వ్యాక్సినేషన్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఇరడాపల్లి సచివాలయం పరిదిలోని బొక్కెళ్ళు అంగన్వాడీ కేంద్రం, రాయిగెడ్డ గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు) ను సందర్శించి విద్యార్థినీలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. విద్యార్థినీల ఆరోగ్య పరిస్థితిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలు అందించాలని, ప్రతి గురువారం ఐరన్ మాత్రలను అందించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మినుములూరు పిహెచ్సి వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, గోపాలకష్ణ, హెల్త్ అసిస్టెంట్ బి.ఎలీషారావు, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యలక్ష్మి

బాల్య వివాహాలతో అనర్థాలు
- ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి-పెదబయలు: తమరాడ, పెడబయలు అంగన్వాడీ కేంద్రాలను జిల్లా సమగ్ర శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సూర్యలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అనంతరం.స్థానిక జి.టి డబ్ల్యూ బాలికల ఉన్నత పాఠశాల, సీతగుంట బాలికల వసతి గృహంలో 9,10, తరగతులు చదువుతున్న విద్యార్థినులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యలక్ష్మీ మాట్లాడుతూ,విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. చదువుతో పాటు ఆటపాటల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. బాల బాలికలకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పలాలు అందిస్తుందన్నారు. చిన్నప్పుడే వివాహాలు చేసుకొని జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. చిన్నప్పుడే పెళ్లిలు చేసుకుంటే పుట్టే పిల్లలు బరువు తక్కువగా ఉండి, చనిపోయే ప్రమాదముందని తెలిపారు. ఆడపిల్లలు ఒంటరిగా ప్రయాణం చేసే టప్పుడు జాగ్రత్తలు పాటించాలని, తల్లిదండ్రుల సహకారంతో వెళ్లాలని సూచించారు.విద్యార్థినిలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడీపీఓ ఎన్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

50 ఆహార తయారీ యూనిట్ల స్థాపనే లక్ష్యం

ప్రజాశక్తి పాడేరు: జిల్లాలో ఈ ఏడాది కనీసం 50 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని మార్కెటింగ్, సహకార శాఖ, ఫుడ్ ప్రోసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి సూచించారు. శనివారం కలక్టరేట్ సమావేశ మందిరంలో రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలుతో నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ, సంఘటితంగా ఏర్పడి పని చేసుకోటానికి ఇది చక్కని వేదికగా ఉపయోగపడుతుందన్నారు. భూమి, రుణం వంటి ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఒక ప్రాజెక్ట్ ఏర్పాటుకు ముందుగా అన్ని విషయాలపై అవగాహన కలిగి సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక అందిస్తే బ్యాంకులు రుణాలు ఇవ్వటానికి ముందుకు వస్తాయన్నారు. జిల్లాలో ఎక్కువ ఆర్గానిక్ పంటలు పండిస్తున్నారని, భవిష్యత్తులో అదే పద్ధతి కొనసాగించాలని ఆయన సూచించారు. ఇందుకు శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలన్నారు. దిగుబడి పెరిగే మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు.

జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కాఫీ, మిరియాలు, పసుపు తదితర పంటలను పండించడం జరుగుతుందని తద్వారా రైతులకు ఎంతోమందికి జీవనోపాధి కలుగుతుందన్నారు. ఈ ఉత్పత్తులకు స్టోరేజి సౌకర్యం కల్పిస్తే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ, కాఫీ పల్పింగ్ యూనిట్లను ఏర్పాటు చేసామని, ఇటీవల డ్రయింగ్ యూనిట్ కూడా ఏర్పాటు చేసామని, కాఫీ రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఎం.సరస్వతి మాట్లాడుతూ పండ్ల తోటల అమ్మకాలకు మార్కెటింగ్, స్టోరేజ్ సదుపాయం కల్పించాలని, సూచించారు.

ట్రైకార్ చైర్మన్ శతక బుల్లి బాబు మాట్లాడుతూ, పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

జిల్లా లీడ్ మేనేజర్ రవి తేజ మాట్లాడుతూ, బ్యాంకర్లు రుణాలు మంజూరుకు సుముఖంగా ఉన్నాయని, జిల్లా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సదస్సులో అగ్రికల్చరల్, హార్టికల్చరల్, బ్యాంకర్స్, కాఫీ బోర్డు, ఇండస్ట్రీస్, స్పైసేస్ బోర్డు అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి

మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి

చంపగూడలో ఎస్టి కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజలతో మాట్లాడుతున్న రవిబాబు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని మారుమూల కోలాపుట్టు పంచాయతీ చంపగూడ గ్రామంలో అకస్మాత్తుగా రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు శనివారం సందర్శించారు. ఆ గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థ పనితీరును అడిగి తెలుసుకుని ఆరా తీశారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ, భూ రీ సర్వేకి సంబంధించి ఎటువంటి తగాదాలు తలెత్తకుండా సజావుగా ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా గిరిజనులకు అందేలా ప్రత్యేక చొరవ చూపాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గ్రామంలో కరెంట్ స్తంభాలు అదనంగా ఏర్పాటు చేయాలని విన్నవించారు.ఆంధ్ర ఒడిశా బోర్డర్‌కి సంబంధించిన భూ సమస్యలను సత్వరంగా పరిష్కారిమించాలని విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన ఆంధ్ర ఒడిశా బోర్డర్‌లో భూ సమస్యకు సంబంధించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్యను పరిష్కరించే మార్గం చూపుతానని గ్రామస్తులతో తెలిపారు.ఆయనతో పాటు స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సమర్ధి భాస్కరరావు, పాంగి చిన్నారావు, అప్పలరాజు రామదాసు, రాము నాయుడు, పరశురాం, సీతారాం, ప్రకాష్, సుందర్‌రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం కుటుంబానికి పరామర్శ

మండలంలోని కొల్లపుట్ పంచాయతీకి చెందిన కొర్రా సీతారాం సతీమణి మాజీ సర్పంచ్ కొర్రా జమున మృతి చెందడంతో రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు చంపగుడ గ్రామంలో శనివారం పర్యటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాంగి చిన్నారావు, సమర్ధి భాస్కరరావు, హెచ్.బి.అప్పలరాజు, తాంగుల రాందాసు, కొర్రా కాసులమ్మ, ప్రకాష్, ప్రసాద్, సుందరరావు, పి.పరశురాం, హెచ్.బి.రామునాయుడు, తదితరులు ఉన్నారు.

గురుకుల విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ యూత్ క్యారమ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎం.యశ్వంత్‌కు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యశ్వంత్ ఫిబ్రవరిలో ముంబయిలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొనున్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థిని ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపల్ బి.రామకృష్ణ, అల్లు సత్య సుధాకర్, ఎస్.లక్ష్మణరావు అభినందించారు. యశ్వంత్ విజయం పట్ల గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి హర్షం వ్యక్తం చేశారు.

ఐటిడిఎలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీడీ

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఐటిడిఎలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం ఆపదలో వున్న వారి ప్రాణాలు కాపాడడానికి దోహదపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా, రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ ఎస్.గంగరాజు, సెక్రటరీ టి.అప్పారావు, లైఫ్ మెంబెర్స్ లోహితాస్, గౌరీశంకర్, సంజీవరాజు, జయమ్మ, సీతారామయ్య, మెడికల్ ఆఫీసర్ రూపకళ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.

సహాయం చేస్తున్న పాత్రికేయులు

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: సుజనకోట పంచాయతీ కేంద్రంలో గృహం దగ్ధంతో సర్వం కోల్పోయిన గిరిజన బాధితుడు మండి బాపన్నకు గిరిజన విలేకరుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పాత్రికేయులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సుజన కోట గ్రామంలో దగ్ధమైన గహాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఏపీటీఆర్ఏ జిల్లా సహాయ వర్గ సభ్యులు కాంతారు మోహన్, మండల అధ్యక్ష కార్యదర్శులు కూడ మోహన్, రెయ్యల నాగభూషణంలు మాట్లాడుతూ, ఎపిటిఆర్ఎ అల్లూరి జిల్లా నేతల ఆదేశాల మేరకు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన పాత్రికేయులు శంకర్, కిషోర్ కుమార్, కోటి బాబు, భాస్కర్, ఈశ్వర్, అనీల్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి-సింహాచలం: అమావాస్యను పురస్కరించుకొని వరహా పుష్కరిణిలో సింహాద్రి అప్పన్న తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవం సందర్భంగా స్వామివారిని మేల్కొల్పి పలు ఆరాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పల్లకిలో మెట్ల మార్గం గుండా కొండ దిగువకు తీసుకొచ్చి వరహా పుష్కరిణిలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం హంస వాహనంపై పుష్కరిణి మధ్యలో ఉన్న మండపానికి చేర్చారు. అనంతరం పుష్కరిణి సత్రానికి చేరుకొని, ప్రత్యేక మనోరంజక వాహనంపై గోపాలస్వామి అలంకరణలో ఉన్న స్వామివారికి గ్రామ తిరువీధి నిర్వహించారు. స్వామివారికి భక్తులు తమ ఇళ్ల ముందు రంగవల్లులు వేసి సాధర స్వాగతం పలికారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెరువు ప్రాంతంలో ప్రత్యేక పోలీసు భద్రత, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఈ ఉత్సవంలో దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవో వి.త్రినాధరావు, దేవస్థానం అధికారులు, పోలీసులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తుల పాల్గొని తెప్పోత్సవాన్ని వీక్షించారు.

టైర్ పంచర్ కావడంతో చింతపల్లి కాంప్లెక్స్‌లో నిలిచిపోయిన బస్సు

కాలం చెల్లిన బస్సులతో ఇబ్బందులు

ప్రజాశక్తి - సీలేరు : విశాఖ నుంచి చింతపల్లి, సీలేరు మీదుగా భద్రాచలం వరకు కాలం చెల్లిన, కండిషన్‌లో లేని బస్సులు నడుపుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం అర్ధరాత్రి చింతపల్లి బస్టాండ్‌లో విశాఖ డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడిన విషయాన్ని మరువక ముందే శనివారం భద్రాచలం నుంచి విశాఖ వెళ్తున్న బస్సు టైర్ పేలిపోయింది. భద్రాచలంలో శనివారం ఉదయం బయలుదేరిన విశాఖపట్నం డిపో చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు మధ్యాహ్నం ఒంటిగంటకు చింతపల్లి కాంప్లెక్స్‌కు వెళ్లేసరికి టైర్ పేలిపోయింది. దీంతో ఏమి జరిగిందోనని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ బస్సు దిగి పరిశీలించగా టైరు పంచరైనట్లు గుర్తించారు. దీంతో అక్కడ ప్రయాణికులు 3.30 గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. గతంలోనూ అనేక మార్లు రాత్రి సమయంలో కారడవిలో బస్సులు నిలిచిన పోయిన సందర్భాలున్నాయి. అయినా ఆర్టీసీ అధికారులు ఈ మార్గంలో కండిషన్ లేని బస్సులను తిప్పుతూ ప్రయాణికులకు అనేక ఇబ్బందులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు కళ్ళు తెరిచి ప్రయాణికులకు అసౌకర్యాలు కలగకుండా కండిషన్ కలిగిన బస్సులను తిప్పాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి - అడ్డతీగల : మండలంలోని పులిగోగులపాడు పంచాయతీ పరిధిలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న చెందుర్తి రాజామణి (54) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడ ప్రైవేట్ హాస్పిటల్లో వైద్యం పొందుతున్నారు. పరిస్థితి విషమించి శనివారం తుది శ్వాస విడిచారని బంధువులు తెలిపారు. ఆమెకు ఒక కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త బాబూరావు ఎఎస్ఐగా పని చేస్తుండగా, ఒక కుమారుడు పులి గోగులపాడు పంచాయితీ సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాజామణి మృతికి సిఐటియు కార్యదర్శి బి నిర్మల, అధ్యక్షులు గుల్లల సురేష్ బాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

మన్యం కొండ జాతరపై సమావేశం

ప్రజాశక్తి-మోతుగూడెం : ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే మన్యం కొండ జాతరపై ఒడిశా అధికారులు, ఆంధ్ర కమిటీ సభ్యులు శనివారం ఒడిశాలోని మన్యంకొండ గ్రామంలో సమావేశమై చర్చించారు. ఫిబ్రవరి 27న ఆంధ్ర పోల్లూరు గ్రామంలో జలపాతం వద్ద జరిగే ఈ జాతర కోసం తగిన ప్రణాళికలపైనా, ప్రజల అవసరాలపైనా చర్చించడం జరిగింది. ఒడిశా, ఆంధ్ర మధ్య ఉన్న సీలేరు నది మీద మట్టితోని రాంప్ చెయ్యాలని కోరారు. త్వరలో ఏపీ జెన్కో అధికారులతో ఒడిశా అధికారులు సమావేశమై జాతర కోసం చర్చిస్తామని చెప్పారు. ఈ జాతరకు 15 వేల మంది వస్తారని, వారి యొక్క బాగోగులు చూడాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో మల్కాన్‌గిరి, కలిమల తహశీల్దార్లు, జెడ్‌పిటిసి, మల్కానగిరి ప్రధాన పూజారులు, ఆంధ్ర, ఒడిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రతో జగన్‌లో భయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అనుమతులు ఇచ్చినా, ఇవ్వకపోయినా కుప్పంలో ఈ నెల 27న ఉదయం 11 గంటలకు నారా లోకేష్ పాదయాత్ర మొదలవుతుందని, ఆ యాత్ర పట్ల సిఎం జగన్‌లో భయం మొదలైందని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న తెలిపారు. శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా టార్గెట్ లోకేష్' అని జగన్ అన్నారని, దీనిని బట్టి లోకేష్ మీద దాడులు చేస్తారనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. కేంద్రం జోక్యం చేసుకుని ప్రత్యేక బలగాలతో రక్షణ కల్పించాలన్నారు. జిఒ నెంబర్ 1పై సుప్రీంకోర్టులోనూ రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కదురైందన్నారు.

ముగిసిన 'ఇన్ఫినిటీ వైజాగ్ -2023'

ఐటి అభివృద్ధికి విస్తృత అవకాశాలు : మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐటి రంగం అభివృద్ధికి విశాఖలో విస్తృత అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటిఎఎపి), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిపిఐ) ఆధ్వర్యంలో ఎపి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహకారంతో నగరంలోని ఓ హోటల్‌లో రెండు రోజులుపాటు నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్ – 2023 ఐటి సదస్సు శనివారంతో ముగిసింది. చివరి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో విశాఖకు ఐటి సంస్థలు క్యూకట్టనున్నాయన్నారు. సుమారు మూడు వేల మంది ఇన్ఫోసిస్ ఉద్యోగులు నగరంలోని 50 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్నారని, వారంతా తిరిగి ఇతర నగరాలకు వెళ్లేందుకు సిద్ధంగా లేరని తెలిపారు. కోవిడ్ అనంతరం పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయని, ప్రతి ఏడాదీ వేల మంది ఇంజినీర్లు రిలీవ్ అవుతున్నారని, వారంతా టైర్ – 2, టైర్ – 3 సిటీల్లోని సంస్థల్లో పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారని అన్నారు. మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్, 28, 29, 30 తేదీల్లో జి – 20 సమావేశాలు విశాఖలో జరగనున్నాయన్నారు. దీంతో ప్రపంచం దృష్టిని విశాఖ ఆకర్షించబోతోందన్నారు. సరిగ్గా రెండు నెలల్లో విశాఖ పరిపాలనా రాజధాని కాబోతోందని తెలిపారు. ఎపి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గ్రూపు సిఇఒ ఎస్.కిరణ్ రెడ్డి మాట్లాడుతూ భోగాపురం వద్ద 90.1 ఎకరాల్లో ఐటి పార్క్‌కు త్వరలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. తిరుపతి సమీపంలోని పల్లం వద్ద 527 ఎకరాల్లో, ఎంపేడు వద్ద 447.47 ఎకరాల్లో నూతన ఐటి పార్కుల నిర్మాణం జరుగుతోందన్నారు. బెంగళూరుకు అతి దగ్గరలో సత్యసాయి జిల్లా తెలుకొడు వద్ద 394.27 ఎకరాల్లో పిపిపి పద్ధతిన ఐటి పార్క్ నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఐటి రంగం విస్తృతికి ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. సదస్సులో ఐటిఎఎపి గౌరవ అధ్యక్షురాలు లక్ష్మీ మొక్క, రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ కొసరాజు, అమరావతి ఛాప్టర్ ప్రెసిడెంట్ ఎస్.నరేంద్ర కుమార్, ఎపి ఐటి అడ్వైజర్లు దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, చంద్రహాస్, ఎస్‌టిపిఐ డైరెక్టర్ సివిడి.రాంప్రసాద్, ఎపి ఎన్‌ఆర్ఐ ఐటి అడ్వైజర్ మేడపాటి వెంకట్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమర్‌నాథ్

ఎయులో ఉమెన్స్‌కు 'విద్యాతరంగిణి'

సరికొత్త హంగులతో వర్సిటీ ప్రాంగణంలో హాస్టల్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎయులో నాటి 'విద్యాభవన్'.. నేడు విద్యాతరంగిణిగా మారింది. ఇంకా ముందు సంవత్సరాలకు వెళితే దూర విద్యా కేంద్రం (స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్) కూడా ఇక్కడే ఉండేది. ఈ భవనం నిర్మించి 40 ఏళ్లు దాటిపోవడంతో ఆంధ్రా యూనివర్సిటీ యాజమాన్యం దృష్టిసారించి 'విద్యా భవన్‌కు సరికొత్త హంగులు అద్దింది. ఎయుపై పూర్వీకులు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా 'విద్యా తరంగిణి' అనే పేరున పాత భవనాన్నే రూ.40 లక్షలతో ఆధునీకరించి ఆ భవనానికి 'న్యూ లుక్'ను తెచ్చిపెట్టడం చెప్పుకోదగ్గ విశేషం.

ఎయులో అసలేం జరుగుతోంది ?

యూనివర్సిటీలో హిందీభవన్, తెలుగు డిపార్టుమెంట్‌ల మధ్యలో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, సంస్కృతం విభాగం ఒకే భవంతిలో కింద, పైనా ఉండేవి. 'విద్యాభవన్' అనే పేరుతో ఈ భవనం దర్శనమిచ్చేది. రెండు నెలల క్రితం ఈ రెండు విభాగాలను ఎయు వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి ఎదురుగా ఉండే ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోకి తరలించారు. సుమారు 50 వేల చదరపు అడుగుల వైశాల్యంగల ఈ భవంతిని నాటి నుంచీ ఆధునీకరించే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఈ భవనం పెయింటింగులతో సరికొత్త రూపం దాల్చింది. ఈ భవనానికి ఎడమ వైపున ఉన్న ఖాళీ ప్రదేశంలో లోపలకు వాహనాలు ప్రవేశించేందుకు వీలుగా రహదారి, గార్డెనింగ్ కోసం సైతం తాజాగా చకచకా పనులు జరుగుతున్నాయి. ఈ పాత భవనాన్ని దాతలిచ్చిన రూ.40 లక్షలతో సరికొత్తగా నిర్మాణం చేసి 294 మంది ఎయు విద్యార్థినులకు హాస్టల్‌గా మార్చినట్టు వీసీ ప్రసాదరెడ్డి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎయు ఉమెన్స్ హాస్టల్‌కు ఈ భవనాన్ని ఉపయోగించడం తమకెంతో ఆనందంగా ఉందని, పైగా ఎయు ప్రాంగణంలోనే ఉండడం.. తమకు క్లాసులకు వెళ్లడం, అక్కడి నుంచి వచ్చాక చదువుపై దృష్టిపెట్టడం సులభంగా ఉందంటూ క్లాసుల నుంచి వచ్చి పోయే విద్యార్థినులు వెల్లడించారు. ప్రస్తుతం ఎయు ఉమెన్స్ హాస్టల్ జిల్లా పరిషత్ వద్ద ఉంది. వర్సిటీలో వివిధ ఫ్యాకల్టీల సంఖ్య పెరగడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ విద్యార్థులు వస్తున్నారు. ఆదివారం ఇక్కడ చినజీయర్ స్వామితో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని కూడా వీసీ నిర్వహిస్తున్నారు.

జరుగుతున్న ప్రచారం ఏంటి ?

రాష్ట్ర పాలనా రాజధానిగా విశాఖ ఉంటుందన్న ప్రతిపాదన నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజినీరింగ్, ఆర్ట్స్ విభాగాలను యాజమాన్యం తరలింపు చేస్తుందన్న ప్రచారం తాజాగా ఊపందుకుంది. విద్యార్థులను రెండు డిపార్టుమెంట్ల నుంచి ఒకే భవనంలోగల ఎడ్యుకేషన్, సంస్కృతం విభాగాలను తరలించిన మాట నిజమే అయినా వారిని బయటకు పంపకుండా ఆర్ట్స్ కాలేజీలోనే ఆయా విభాగాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఇంకా అనేక భవనాలను ఎయులో సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. ఖాళీ ప్రదేశాలను సైతం పూర్తిస్థాయిలో వినియోగించేందుకు దాతల సాయంతో అభివృద్ధి చేస్తున్నారు. పాత విద్యాభవన్‌ను పూర్తిగా నిర్మాణం చేయాలంటే 50 వేల ఎస్ఎఫ్‌టికి రూ.12 కోట్ల మేర ఖర్చవుతుంది. కానీ రూ.40 లక్షలతో సరికొత్త హంగులను తీసుకొచ్చారు. ఈ విభాగాలను తరలించనంత వరకూ విద్యాభవన్‌లోగల ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో 13 మంది విద్యార్థులు, ముగ్గురు ఫాకల్టీలే ఉండేవారు. సంస్కృత విభాగం ఒక అధ్యాపకునితో 10 సంవత్సరాల పాటు ముగ్గురు స్టూడెంట్స్‌తోనే నడవడంతో ఈ భవనంపై ఎయు యాజమాన్యం దృష్టి సారించి మార్చేసినట్లు తెలుస్తోంది. అలాగే గత పదేళ్లలో 200 మంది ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నుంచి, సంస్కృతం విభాగం నుంచి 50 మంది మాత్రమే చదువుకుని బయటకొచ్చారు. గతంలోని విద్యా భవన్‌కు నేడు విద్యాతరంగిణి అని పేరుపెట్టినట్లు వీసీ చెబుతున్నారు.

పింఛను తొలగించిన వృద్ధురాలితో మాట్లాడుతున్న సర్పంచ్ మల్లీశ్వరి

వృద్ధుల కంచంలో కూడు లాగేసుకుంటారా ?
- వేటుకూరు సర్పంచ్ ఈతపల్లి మల్లీశ్వరి

ప్రజాశక్తి - మారేడుమిల్లి : మండలంలోని వేటుకూరు పంచాయతీలో 4వ విడత 'నమస్తే ప్రజాప్రతినిధి' కార్యక్రమంలో భాగంగా వేటుకూరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామల్లో శనివారం సర్పంచ్ ఈతపల్లి మల్లీశ్వరి పర్యటించారు. వేటుకూరు, దేవుడు లంకల వీధిలో పింఛన్ తొలగించిన కదల పొట్టమ్మ (90) అనే వృద్ధురాలిని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పొట్టమ్మ పేరు మీద 7 ఎకరాలు భూమి మాత్రమే ఉందని, అన్యాయంగా పింఛన్ తొలగించారని తెలిపారు. ఆమెను ఎలా ఓదార్చాలో అర్థం కాలేదన్నారు. వృద్ధులకు ఎటువంటి భరోసా లేకుండా ప్రభుత్వం అన్యాయంగా పింఛన్లు తొలగించటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బతకడానికి వృద్ధులకు చేయూతనిచ్చి, తినడానికి అన్నం పెట్టె వృద్ధాప్య పింఛన్లు ఏదో కారణంతో తొలగించడమంటే వారి కంచంలో కూడును లాగేసుకున్నట్లు అందుతున్నారు. రేషన్ కోల్పోయి, పింఛన్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న ఆమెకు ఆదుకోవాలన్నారు. గిరిజనులకు భూమి ఎక్కువ ఉన్న ఉపయోగం లేదని, ప్రభుత్వం దాన్ని పూర్తిగా విస్మరించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తొలగించిన పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలని ఆమె కోరారు. లేని పక్షంలో ప్రజల తో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గానాల రామ్మూర్తికి నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గానాల రామ్మూర్తి విశ్వబ్రాహ్మణులకు ఆదర్శప్రాయుడని వైసిపి సీనియర్ నాయకులు కెల్ల సత్యనారాయణ అన్నారు. ఎంవిపి కాలనీలోని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం కమ్యూనిటీ హాల్లో శనివారం ఉదయం గానాల రామ్మూర్తి జయంతోత్సవాలను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు శివకోటి శ్రీనివాసులు, బిసి సంఘం నాయకులు కర్రి వేణుమాధవ్, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు ఈశ్వరరావు, అడవికొలను వేణుగోపాలకృష్ణ, గిడిజాల పార్వతీశం ఆచారి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సౌత్ ఈస్టర్న్ రైల్వేలోని ఖరగ్‌పూర్ డివిజన్‌లో భద్రత సంబంధిత ఆధునికీకరణ పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. 18046 హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29, 31, ఫిబ్రవరి 1 తేదీల్లోనూ, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30, ఫిబ్రవరి 1, 2 తేదీల్లోనూ రద్దయింది. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 19న విశాఖపట్నం పోర్టు అథారిటీ బోర్డు రహస్యంగా నిర్వహించిన సమావేశంలో పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ (జిజెహెచ్)ను పిపిపి పద్ధతిలో ప్రైవేటుపరం చేయాలని, కార్గో హ్యాండ్లింగ్ డివిజన్ (సిహెచ్‌డి)లో పనిచేస్తున్న 347 బ్యాచ్ క్యాజువల్ కార్మికులను తొలగించాలని విశాఖపట్నం పోర్టు బోర్డు నిర్ణయించినట్టు తెలిసిందని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జె.సత్యనారాయణ, సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శులు కె.సత్యనారాయణ బి.లక్ష్మణరావు సంయుక్త ప్రకటనలో శనివారం తెలిపారు. ఇటువంటి నిరంకుశ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించబోమని, తక్షణం ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను సొంత నిధులతో అభివృద్ధి చేయాలని, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు.